క్లుప్తంగా

అనుమతి తప్పనిసరి

బాడంగి: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు తప్పనిసరిగా పోలీస్ అనుమతి తీసుకోవాలని ఎస్సై ఆర్. జయంతి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ, మంటప నిర్వాహకులు ఎన్ని రోజులు ఉత్సవం నిర్వహిస్తారో తెలియజేయాలన్నారు. నిమజ్జనం వివరాలు కూడా ముందుగా తెలియజేసి, అనుమతి పొందాలని సూచించారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి..

తెర్లాం: ప్రతి విద్యార్థీ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

హర్షం..



ఎమ్మెల్యే శంబంగి సోదరులను సత్కరిస్తున్న తెర్లాం మండల వాసులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ తెర్లాం మండల అధ్యక్షుడిగా తెంటు సత్యంనాయుడును నియమించడం పట్ల ఆ మండలంలోని పలు గ్రామాల ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సత్యంనాయుడు, తదితరులు మండలంలోని పక్కి గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు అతని సోదరుడు వేణుగోపాలనాయుడును సత్కరించారు.

భాగవత పోటీలకు ఎంపిక



భాగవత పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సంతకవిటి: అంతర్జాతీయ భాగవత ఆణిముత్యాల సంస్థ నిర్వహించే పోటీలకు బొద్దూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సుగంధం శ్రావణి, దేవర నవీన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం మల్లేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు భాగవతంపై తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణ ప్రత్యేక శిక్షణ ఇచ్చారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు ఎ.దామోదరరావు, లక్ష్మీభాను, సత్యనారాయణ, ప్రసాదరావు అభినందించారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు



బంగారువలసలో బోరు బాగుచేస్తున్న మెకానిక్

వంగర: మండల పరిధి కొప్పరవలస, బంగారువలస గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లుకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. స్థానిక సర్పంచ్ సాదెం లలితకుమారి, సాదెం శ్రీరాంమూర్తి ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లోని ప్రధాన వీధులు, ఎస్సీ కాలనీలు, రామాలయం వీధుల్లో ఇటీవల మరమ్మతులకు గురైన ఆరు బోర్లను బాగుచేసినట్లు బోర్‌మెకానిక్ వెంకటరమణ తెలిపారు.

గ్రామాల్లో జోరుగా అభివద్ధి పనులు



వన్నలిలో నిర్మిస్తున్న కాలువ

రేగిడి: గడపగడపకు నిధులతో గ్రామాల్లో అభివద్ధి పనులు చేస్తున్నారు. మండలంలో వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, చిన్నశిర్లాం, పెద్ద శిర్లాం తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మిస్తున్నామని ఎంపీడీఓ శ్యామలాదేవి వెల్లడించారు. ఒక్కో సచివాలయ పరిధిలో రూ.20 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను గుర్తించి, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నామన్నారు.

● చవితి వేడుకలకు సర్వం సిద్ధం



వంగర: గణనాథుని విగ్రహాన్ని వాహనంలో తరలిస్తున్న వంగర యువకులు



తెర్లాం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మంటపం



రేగిడి: కాగితాపల్లిలో మట్టివినాయక ప్రతిమలు ఇంటింటికీ అందజేస్తున్న విద్యార్థులు



రేగిడి: పానుగోటివలసలో రాకెట్ ఆకారంలో వినాయక మంటపం



వంగర: వినాయక విగ్రహాన్ని వ్యాన్‌లో తరలిస్తున్న కొప్పర గ్రామ యువకులు



రాజాం: మారుతీనగర్ మూడోలైన్‌లో వేసిన మండపం



సంతకవిటి: ట్రాక్టర్‌లో గణనాథున్ని తరలిస్తున్న దృశ్యం



రాజాం: మార్కెట్ నుంచి మండపానికి తరలిస్తున్న వినాయక విగ్రహాలు

గ్రామాలు, పట్టణాల్లో వినాయక చవితి సందడి నెలకొంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల నిర్వహణకు ఇప్పటికే యువత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. భారీ మంటపాలను ఏర్పాటు చేశారు. వివిధ రంగులతో, విద్యుత్ కాంతులతో వాటిని అలంకరించారు. మరోవైపు మార్కెట్‌లో కొనుగోలు చేసిన గణపతి విగ్రహాలను మంటపాలకు తరలించే పనిలో ఉత్సవ కమిటీలు బిజీగా ఉన్నాయి. భారీ పరిమాణంలో ఉన్న విగ్రహాలను ఆటోలు, ట్రాలీలపై తరలిస్తూ కనిపించారు. ఉత్సవాల నిర్వహణకు ముందుస్తు అనుమతులు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో పండగను చేసుకోవాలని పోలీసులు సూచించారు. మరోవైపు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ఈ మేరకు పలుచోట్ల మట్టివిగ్రహాలను పంపిణీ చేశారు. – బొబ్బిలి/రాజాం సాక్షి నెట్‌వర్క్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

● ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని శివడవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ఒక్కోఇంటికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమవుతుందని చెప్పారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, శంబంగి సుధ, పెద్దింటి శంకరరావు, సర్పంచ్ లక్ష్మీరాణి, సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌కే పట్టం..

● వైఎస్సార్‌సీపీ నాయకులు చొక్కాపు లక్ష్మణరావు, శంబంగి వేణుగోపాలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, శంబంగి వేణుగోపాలనాయుడు

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలరావునాయుడు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, స్కిల్ డవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేస్తే, ఆ పార్టీ నాయకులతో పాటు జనసేన నాయకులు ఆందోళనకు దిగడం అన్యాయమన్నారు. దోచుకున్న వారు ఎంతటి వారైనా జైలుకు వెళ్లక తప్పదని చెప్పారు. ప్రజలకు మంచి చేయడం ద్వారా మళ్లీ గెలవాలనే సిద్ధాంతంతో తమ నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు నీరాజనం పడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో రామభద్రపురం ఎంసీసీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డబ్ల్యుఎస్ రాయులు, నాయకులు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, డర్రు పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతకు పాటుపడాలి

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పర్యావరణ సమతుల్యతకు ప్రతిఒక్కరూ పాటు పడాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణానికి చెందిన గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు సంఘాలు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, వనమిత్ర అధ్యక్షుడు కె. కృష్ణదాసు, మాజీ సైనిక సంఘ సభ్యులు వీఎస్ శర్మ, పట్టణ సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

శివరామమూర్తి సేవలు ప్రశంసనీయం



శివరామమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించిన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి, పక్కన తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్

తెర్లాం: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వపు రిజిస్ట్రార్, మండలంలోని కొరటాం గ్రామానికి చెందిన దివంగత ప్రొఫెసర్ నున్నగొప్పుల శివరామమూర్తి సేవలు ప్రశంసనీయమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రామమూర్తి కుటుంబ సభ్యులు గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రిజిస్ట్రార్‌గా శివరామమూర్తి అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. కొరటాం చుట్టుపక్కల ప్రాంతాల యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రధానపాత్ర పోషించారని తెలిపారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ.. శివరామమూర్తి వ్యక్తిత్వం, ఆయన భావాలు, ఆశయాలు తమకు ఎల్లప్పుడు ఆదర్శంగా ఉంటాయన్నారు. తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ శివరామమూర్తి నేటి యువతకు ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కొరటాం సర్పంచ్ ప్రతినిధి చీకటి శ్రీకాంత్, జెడ్పీటీసీ సభ్యులు లూర్థు రామారావు, పాలవలస ఇందుమతి, శివరామమూర్తి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

వంగర: ఇంటర్మీడియట్‌లో 2022–23 విద్యాసంవత్సరంతో పాటు అంతకుముందు ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు తెలిపారు. అలాగే మధ్యలో చదువు నిలిపివేసిన విద్యార్థులకు కూడా ఫీజు చెల్లించి పరీక్షలు రాసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. వీరంతా 2024 మార్చిలో జరగనున్న ఇంటర్ పరీక్షలు రాసేందుకు అర్హులని తెలిపారు. 2017 నుంచి 2019వ సంవత్సరం వరకు ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు కళాశాలకు వచ్చి సర్టిఫికెట్లు తీసుకోవాలని కోరారు.

మెడికల్ కళాశాల ఏర్పాటు గొప్ప విషయం



బొబ్బిలి: జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు గొప్ప విషయమని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోధరరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, టీడీపీ హయాంలో ఎన్నిసార్లు వినతులిచ్చినా పట్టించుకోలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కళాశాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

● ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రాజాం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం లబ్ధిదారుకు అందజేశారు. ఒమ్మి గ్రామానికి చెందిన చిత్తిరి నాగమణి భర్త కృష్ణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందారు. వైద్యఖర్చుల కోసం చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందించాలని ఎమ్మెల్యే జోగులు ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. వెంటనే స్పందించిన సీఎంఓ కార్యాలయం అధికారులు రూ.2.40 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే జోగులు బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, నాయకులు వంగా శ్రీనివాసరావు, బొద్దాం సర్పంచ్ నక్క శ్రీను, ముదిలి శ్రీనివాసరావు, కొయ్యాన భాస్కరరావు, పొట్నూరు శ్రీనివాసరావు, మన్మథరావు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



రాజాం సిటీ: పూజల్లో పాల్గొన్న కామాక్షీదేవి స్వర్ణకార విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు



రాజాం: విశ్వకర్మ జయంతి పూజల్లో పాల్గొన్న పాలవలస శ్రీనివాసరావు, తదితరులు

రాజాం: పట్టణంలో కస్పావీధి, వైఎస్సార్ పార్కు ప్రాంతాల్లో విశ్వకర్మ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కస్పావీధిలో స్వర్ణకార సంఘ అధ్యక్షుడు ముగడ రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, ఆసపు సూర్యం, కరిమి రవి, తదితరులు పాల్గొని విశ్వకర్మకు పూజలు చేశారు. సాయంత్రం అనుపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం ప్రతినిధులు ఎం.రవి, చిప్పాడ శ్రీను, సింహాంద్రి ఆనంద, కోసూరు జగన్మోహనరావు, గుంటముక్కల సప్తకొరి, కె.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: స్థానిక ఠాణావీధిలో మద్విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కామాక్షీదేవి స్వర్ణకార విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న సీఐ రవికుమార్

రాజాం సిటీ: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ అన్నారు. అవతార్ మెహర్‌బాబా కేంద్రం 37వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ..ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, కొత్త భాగ్యలక్ష్మి, పీవీ శ్రీనివాసరావు, దేబారిక రామప్పడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఈక్రాప్ నమోదు



ఉప్పర్నాయుడువలసలో ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రేగిడి: మండలంలోని రైతులు ఈక్రాప్ నమోదు ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. రైతులు ఆర్‌బీకేలు వద్దకు చేరుకుని వీఏఏలు, వీఆర్‌ఓలు ద్వారా తాము సాగుచేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయించుకుంటున్నారు. ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వండానపేట, మజ్జిరాముడుపేట, అప్పాపురం తదితర గ్రామాల్లో ఆదివారం వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ–క్రాప్ నమోదు చేస్తూ కనిపించారు.

ప్రహరీ నిర్మాణం



అసిరితల్లి వనం వద్ద నిర్మించిన ప్రహరీ

రాజాం సిటీ: దేవునిసేవలో మేము సైతం అంటూ మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన గార త్రినాథరావు, సత్యనారాయణ తమ ఔదార్యం చాటుకున్నారు. గ్రామంలోని అశిరితల్లి వనం వద్ద తమ సొంత నిధులతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఏటా గ్రామదేవత పండగ జరిగే సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశ్యంతో రూ.50 వేలు ఖర్చుచేసి ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. వారిని గ్రామస్తులు అభినందించారు.